క్లుప్తంగా...

అభినందనలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న భాస్కర్‌రెడ్డి, జగదీశ్వర్ తదితరులు

ఘట్‌కేసర్: డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొందిన ఘట్‌కేసర్ తహసీల్దార్ విజయలక్ష్మిని మంగళవారం నాయబ్ తహసీల్దార్ భాస్కర్ రెడ్డి, సర్వేయర్ జగదీశ్వర్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ అంజిరెడ్డి, సిబ్బంది చందు ముదిరాజ్, రమాకాంత్, కృష్ణ, కుమార్, ఖలీం, విజయలక్ష్మీ, ప్రసన్న పాల్గొన్నారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

కీసర: నాగారం మున్సిపాలిటీకి చెందిన కార్తీక్‌కు ఎంబీబీఎస్ చదువుకునేందుకు ఆసక్తి ఉన్నప్పటికీ ఆర్థిక స్తోమత లేకపోవడంతో పుస్తకాలు కొనుగోలు చేసేందుకు 15వ వార్డు కౌన్సిలర్ మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.12 వేల నగదును సదరు విద్యార్థికి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక్‌కు ఇకముందు కూడా తనవంతు సహకారం అందిస్తానన్నారు.

విద్యార్థులకు బస్‌పాస్‌ల అందజేత



మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గ్రామ సర్పంచ్ బాబుయాదవ్ బస్‌పాస్‌లు పంపిణీ చేశారు. ఆయా గ్రామాల నుంచి పూడూర్ గ్రామంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు విచ్చేసే విద్యార్థులకు సొంత డబ్బులతో చేయించిన ఆర్టీసీ బస్‌పాస్‌లను విద్యార్థులకు అందజేశారు. ఆర్టీసీ మేడ్చల్ డిపో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, ఉప సర్పంచ్ వెంకటేశ్, పాఠశాల హెచ్‌ఎం మధుసూదన్‌రెడ్డి, వార్డు సభ్యులు హన్మంత్‌రెడ్డి, ఆర్టీసీ సిబ్బంది చంద్రశేఖర్, నాయకులు శంకర్, రేగు నాగేశ్, గడ్డం బాబు, బక్క నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వాటర్ ఫిల్టర్



వాటర్ ఫిల్టర్ అందజేస్తున్న కేబీఆర్ బ్యాంక్ యాజమాన్యం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్ అయ్యప్ప కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రానికి దమ్మాయిగూడ కేబీఆర్ బ్యాంక్ ఎండీ దుర్గాప్రసాద్, బ్యాంచ్ మేనేజర్ ప్రతాప్‌గౌడ్ చేతులమీదుగా వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జయ, ఆయా నాగమణి తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డుకు మరమ్మతులు



ఘట్‌కేసర్ రోడ్డు మరమ్మతును పరిశీలిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని ఆరో వార్డులో నిర్మిస్తున్న రోడ్డు మరమ్మతులను చైర్ పర్సన్ పావనీజంగయ్య, రోడ్డు భవనాల శాఖ ఏఈ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాగునీటి పైపులైన్ పనుల్లో భాగంగా సీసీ రోడ్డును తొలగించినందున తిరిగి రోడ్డుకు మరమ్మలు చేయిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, కరుణాకర్‌యాదవ్, నరేశ్ స్థానికులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మైనంపల్లి



మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ మంగళవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. రెండు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రజల చేతుల్లో.. స్వచ్ఛత పురస్కారం

- స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోటీల్లో ప్రజాభిప్రాయ సేకరణ
- 29 పురపాలికల్లో చెత్త సేకరణపై ప్రజల వద్దకు బృందాలు
- ర్యాంకుల ఎంపిక కోసం ఫోన్లలో అభిప్రాయం నమోదు
- గాంధీ జయంతి రోజున కేంద్రం ర్యాంకుల వెల్లడి



సాక్షి, మేడ్చల్ జిల్లా: స్వచ్ఛ సర్వేక్షణ్–2023 పోటీలో కీలకమైన ప్రజాభిప్రాయ సేకరణలో పురపాలక సంఘాల అధికార యంత్రాంగాలు నిమగ్నమయ్యాయి. పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నాయి. జూలైలో స్వచ్ఛతపై అభిప్రాయ సేకరణ మొదలైనా సాంకేతిక సమస్యలతో ఆలస్యంగా ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రకటిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాల్లో పుర ప్రజల అభిప్రాయానికి కేటాయించిన మార్కులు కీలకం కానున్నాయి. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలికల్లో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సెల్‌ఫోన్లు ఉన్న వారితో చెత్త సేకరణ ప్రతిరోజూ జరుగుతోందా? తడి, పొడి చెత్తను ఇళ్లలోనే వేరు చేస్తున్నారా? పరిసరాలు, ప్రజా మరుగుదొడ్లు శుభ్రంగా ఉన్నాయా? తదితర ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకుని వివరాలను నమోదు చేస్తున్నారు.

పనితీరు ఆధారంగా ర్యాంకు

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ దేశంలోని అన్ని పుర, నగరపాలికల మధ్య స్వచ్ఛతలో పోటీతత్వాన్ని పెంచేందుకు ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పట్టణాభివృద్ధి పరిశుభ్రత, మురుగునీటి వ్యవస్థ, చెత్త సేకరణ, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ, మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగం, ప్లాస్టిక్ వాడకంపై నిషేధం, ఇంకుడు గుంతలు, స్వచ్ఛతలో ప్రజల భాగస్వామ్యం, ఆన్‌లైన్ సేవలపై ప్రజలకు అవగాహన ఇతర అంశాల్లో మెరుగైన పనితీరు కనబర్చిన పురపాలక సంఘాలకు స్కోరు కేటాయించి ర్యాంకులను ప్రకటిస్తున్నారు. ఈ సంవత్సరంలో మొత్తం 9,500 మార్కులకు పోటీ జరుగుతోంది. ఇందులో సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్‌కు 4,525, సర్టిఫికేషన్‌కు 2,500, సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌కు 2,475 మార్కులను నిర్దేశించారు. కేంద్ర బృందాలు పట్టణంలో పారిశుద్ధ్యం కోసం తీసుకుంటున్న చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించి ఇచ్చిన నివేదిక ఆధారంగా గాంధీ జయంతి (అక్టోబరు 2న) కేంద్రం స్కోరును, ర్యాంకులను, పురస్కారాలను ప్రకటించనుంది.

పురపాలికల్లో జనాభా ప్రతిపాదికన పోటీలు

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలక సంఘాలు జనాభా ప్రతిపాదికన జాతీయ, దక్షిణాది రాష్ట్రాల స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ పురస్కారాలకు పోటీ పడనున్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం లక్ష నుంచి 3 లక్షలలోపు జనాభా ఉన్న పురపాలక సంఘాలు జాతీయ స్థాయిలో పోటీపడతాయి. 2011 ప్రకారం లక్షలోపు జనాభా ఉన్న పురపాలక సంఘాలు దక్షిణాది రాష్ట్రాల స్థాయిలో పోటీ పడనున్నాయి. అందులో మళ్లీ 50 వేల నుంచి లక్షలోపు జనాభాకు ఒక విభాగం, 25 వేల నుంచి 50 వేల జనాభా, 15 వేల నుంచి 25 వేల జనాభా, 15 వేల లోపు జనాభా ఉన్న పురపాలికలు(పట్టణాలు) వేర్వేరుగా పోటీపడుతున్నాయి. పట్టణ ప్రజల అభిప్రాయ సేకరణలో స్వచ్ఛందంగా అభిప్రాయాలను నమోదు చేసే అవకాశం ఉన్నా.. ప్రజలకు దీనిపై అంతగా అవగాహన, ఆసక్తి లేకపోవడంతో పురపాలక సంఘాల సిబ్బందే వార్డులు/డివిజన్‌ల్లో తిరుగుతూ సెల్‌ఫోన్ నంబర్లు తీసుకుని ఓటీపీ సాయంతో ఫీడ్ బ్యాక్ నమోదు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ



గోధుమకుంటలోని టీపీఎస్ కాలనీల్లో పర్యటిస్తున్న మంత్రి చామకూర మల్లారెడ్డి తదితరులు

– మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: గోధుమకుంట గ్రామపంచాయతీ పరిధిలోని టీపీఎస్ కృష్ణానగర్ కాలనీలోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం గోధుమకుంట టీపీఎస్ కాలనీలో సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డితో కలిసి ఆయన పర్యటించి కాలనీల్లోని సమస్యలను తెలుసుకున్నారు. టీపీఎస్ కృష్ణానగర్ ఫేజ్–3లో నల్లపోచమ్మ దేవాలయం నుంచి వెంకన్న ఇంటి వరకు, జాతీయ జెండా నుంచి రాజుగారి ఇంటి వరకు తన సొంత నిధులతో సీసీరోడ్డు పనులు చేపడుతున్నట్లు మంత్రి మల్లారెడ్డి తెలిపారు. అంతకుముందు చీర్యాల గ్రామంలోని మల్లికార్జున స్వామి దేవాలయం, బీరప్ప దేవాలయాల అభివృద్ధికి ఒక్కో దేవాలయానికి రూ.5 లక్షల చొప్పున సొంత నిధులు కేటాయిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇందిరా లక్ష్మీనారాయణ, జెడ్పీవైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, సర్పంచ్ ధర్మేందర్, జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య, ఉపసర్పంచ్ అంజనేయులు, ఎంపీటీసీ సభ్యురాలు కిరణ్‌జ్యోతీప్రవీణ్, వార్డుసభ్యులు, గ్రామ కార్యదర్శి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులను ప్రభుత్వం ఆదుకుంటోంది

పోచారం: అన్ని రకాల కులవృత్తులను ప్రభుత్వం ఆదుకుంటూ ప్రోత్సహిస్తోందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం పోచారం మున్సిపాలిటీలోని ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లబ్ధిదారులకు 14 యూనిట్ల గొర్రెలను పంపిణీ చేశామన్నారు. ఇస్మాయిల్‌ఖాన్‌గూడ, యమ్నంపేట్ ప్రాంతాల్లోని కురుమలు ఆర్థికంగా అభివృద్ధి చెందారన్నారు. అందరి సంక్షేమమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న తాగునీటి రిజర్వాయర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ వేమన్‌రెడ్డి, జిల్లా పశు వైద్యాధికారి శేఖర్, జవహర్‌నగర్ మేయర్ కావ్య, మండల సహకార బ్యాంక్ చైర్మన్ రాంరెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొంతం అంజిరెడ్డి, కౌన్సిలర్లు గొంగళ్ల మహేష్, నర్రి ధనలక్ష్మి కాశయ్య, సింగిరెడ్డి సాయిరెడ్డి, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు మందడి సురేందర్‌రెడ్డి, నాయకులు గొంగళ్ల స్వామి, బద్దం జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గొర్రెలు పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, చైర్మన్ కొండల్‌రెడ్డి

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

మేడ్చల్: పట్టణ పరిధిలో ఇద్దరికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను మంత్రి మల్లారెడ్డి తన నివాసంలో లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని ప్రమీలకు రూ.60 వేలు, స్వప్నకు రూ.52 వేలు మంజూరు కావడంతో ఆ చెక్కులను ఆయన వారికి అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు సందీప్‌గౌడ్, శేఖర్‌గౌడ్, మహేష్ యాదవ్, రమేష్, వరుణ్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆపదలో ఆదుకునేందుకు..

కీసర: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని నాగారం బీఆర్‌ఎస్ సీనియర్ నేత గూడురు ఆంజనేయులుగౌడ్ అన్నారు. మంగళవారం నాగారం మున్సిపల్‌కు చెందిన బి.నర్సింహకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన రూ.60 వేల చెక్కును ఆయన లబ్ధిదారుడికి అందజేశారు. బీఆర్‌ఎస్ నేతలు మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న గూడురు ఆంజనేయులుగౌడ్



ఎదులాబాద్‌లో ఆర్థిక సాయం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లో ఇటీవల మరణించిన మృతుల కుటుంబాలకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. గ్రామంలో మృతి చెందిన దశరథ, యాదగిరి, భార్గవి, బాలరాజు కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ ఎంపీటీసీ రవి, మాజీ సర్పంచ్ శంకర్, బీఆర్‌ఎస్ స్థానిక శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి శంకర్, చిరంజీవిముదిరాజ్, బీఆర్‌ఎస్ మండల నాయకుడు లక్ష్మణ్ మృతుల నివాసానికెళ్లి పరామర్శించారు. ట్రస్ట్ తరఫున ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున రూ.25 వేలను అందజేశారు. వార్డు సభ్యుడు ఆంజనేయులుముదిరాజ్, రాంచందర్, సత్తయ్యముదిరాజ్, బాలరాజ్ ముదిరాజ్, నాగరాజు, బాలకృష్ణ, లింగం, వెంకటేశ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

ఘట్‌కేసర్: ములుగు జిల్లా వరద ముంపు గ్రామాల బాధితులకు నిత్యావసర సరుకులు తీసుకెళ్తున్న వ్యాన్‌కు ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అవుషాపూర్‌లో మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. దాతల సాయంతో రూ.2 లక్షల విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు, తినుబండారాలు, కూరగాయలు సేకరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ వరదలతో నిరాశ్రయులైన వారికి సాయం అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పద్మారావు, జీవన్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, సత్యనారాయణ, చంద్రశేఖర్‌గుప్త, బాల్‌రెడ్డి, లింగస్వామి, సురేశ్ పాల్గొన్నారు.

పెంచిన పీజీ, పీహెచ్‌డీ కోర్సుల ఫీజులు తగ్గించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు డిమాండ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఉస్మానియా యూనివర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ కోర్సుల ఫీజులను ఒకేసారి రూ.4 వేల నుంచి రూ.14 వేలు, ఇంజినీరింగ్ కోర్సులు, మరికొన్ని ఇతర కోర్సుల ఫీజులు కూడా రూ.25 వేలకు పెంచడాన్ని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఖండించారు. పేద విద్యార్థులు లక్షలాది రూపాయలు యూనివర్సిటీకి ఫీజుల రూపంలో కడితే తప్పా పీజీ, పీహెచ్‌డీ విద్యను చదువుకునే పరిస్థితి లేదని దుయ్యబట్టారు. ఫీజులను పెంచే క్రమంలో కమిటీని ఏర్పాటు చేయలేదని, విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలతో ఫీజులను పెంచారన్నారు. దేశంలో ఏ యూనివర్సిటీలో లేని విధంగా ఉస్మానియా యూనివర్సిటీలో ఫీజులు పెంచడం వల్ల పేద, మధ్యతరగతి వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేయడమే అవుతుందని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించిన పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షలో మంచి ర్యాంకులతో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు యూనివర్సిటీలో పరిశోధన చేయడానికి అవకాశం కల్పించకపోవడం సిగ్గుచేటన్నారు.

ఆర్టీసీ కార్మికుల సంబురాలు



మేడ్చల్: టీఎస్‌ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని మంత్రివర్గం తీర్మానం చేయడంతో మేడ్చల్ డిపోలో ఆర్టీసీ కార్మికులు సంబరాలు జరుపుకున్నారు. డిపోలో కార్మికులు సీఎం కేసీఆర్, ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ చిత్రపటాలు ఏర్పాటు చేసి పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో డిపో అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

కనీస వసతులను అందుబాటులోకి తెస్తాం

మేడ్చల్: నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మంత్రి మల్లారెడ్డి మనస్సున్న మహారాజని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని తుమ్మచెరువు కట్టపై నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహరెడ్డితో కలిసి పరిశీలించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నా మంత్రి మల్లారెడ్డి తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, ఆలయాలు, మజీద్‌ల అభివృద్ధి, ప్రహరీగోడల నిర్మాణం, కమ్యూనిటీ హాల్స్, కులసంఘాల ఆత్మగౌరవ భవనాలు ఇలా ఏ సమస్య ఉన్నా సొంత నిధులు వెచ్చించి నిర్మాణాలు చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు కనీస వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తమ కుటుంబం ద్వారా నిధులు వెచ్చిస్తున్నామని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, సుహాసిని, నాయకులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు తొలిమెట్టు



తొలిమెట్టు వర్క్స్, హ్యాండ్‌బుక్స్ అందజేస్తున్న డీఈఓ విజయకుమారి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఒకటి నుంచి 5వ తరగతుల వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు బుధవారం నుంచి 8వ తేదీ వరకు మండలస్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో విద్యార్థుల కోసం తయారు చేసిన వర్క్ బుక్కులు, ఉపాధ్యాయుల కోసం రూపొందించిన హ్యాండ్ బుక్స్‌ను ఉపాధ్యాయులకు ఆమె అందజేశారు. ఈ వర్క్ బుక్స్‌ను ప్రతి విద్యార్థికి అందజేసి వాటిని ఏ విధంగా పాఠశాలలో ఉపయోగించాలో తెలపాలని డీఈఓ విజయకుమారి పేర్కొన్నారు. జిల్లాలోని 15 మండల కేంద్రాల్లో తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టులపై రెండు రోజుల చొప్పున శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారంతో పాటు రాగి జావ, నోట్ బుక్స్‌ను మంగళవారం మేయర్ కావ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మన ఊరు – మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వ హయాంలోనే ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు బలవర్ధకమైన బెల్లంతో రాగి జావను అందిస్తుండటంతో వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాంచందర్, ప్రధానోపాధ్యాయులు శేఖరయ్య, నర్సింహ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు రాగి జావను అందజేస్తున్న మేయర్ కావ్య

అక్రమ నిర్మాణాల కూల్చివేత

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి–చర్లపల్లి రహదారిలో అక్రమంగా వెలిసిన 5 షెడ్లను, 3 సెల్లార్ నిర్మాణాలను జేసీబీ సహాయంతో కూల్చివేయించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టే వ్యక్తులు నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవాలన్నారు. టీపీఓ కరుణాకర్, ఆర్ఐ కిషోర్, మున్సిపల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నాగారం మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తూ..

డీఆర్సీ సెంటర్ కోసం స్థలం కేటాయించాలి



జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో నాగారం మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజయేందర్‌రెడ్డిని మంగళవారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. మున్సిపల్ పరిధి రాంపల్లిలోని డీఆర్సీ సెంటర్ కోసం స్థలం, మైనార్టీ ల్యాండ్ సమస్యను జిల్లా అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ మేరకు సానుకూలంగా స్పందించిన జిల్లా అడిషనల్ కలెక్టర్ ల్యాండ్ డిపార్ట్‌మెంట్‌కు వెంటనే ఫార్వర్డ్ చేసిందని, మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తెలిపారు. అనంతరం జిల్లా రెవెన్యూ ఇన్‌చార్జి చంద్రావతిని కూడా వారు కలిశారు. కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, అన్నంరాజు సుమిత్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అత్యున్నత విద్యా ప్రమాణాలతో విద్య



కీసర: అత్యున్నత విద్యా ప్రమాణాలతో కేజీఆర్ కళాశాలలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు కళాశాల చైర్మన్ గోవింద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలోని కేజీఆర్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏలో ప్రస్తుతం 240 సీట్లతో పాటు అన్ని అనుమతులతో నిర్వహిస్తున్నట్లు, ఎంఫార్మసీ, బీఫార్మసీ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. లాభాపేక్ష లేకుండా నాణ్యతతో విద్య అందించడమే లక్ష్యమన్నారు. కళాశాల డైరెక్టర్ పి.వి.రమణారావు, కళాశాల ప్రతినిధి దీపాలి, ప్రొఫెసర్ విజయలక్ష్మీ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారి పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు

మల్కాజిగిరి: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అధికారులకు సూచించారు. మంగళవారం పలు కాలనీల్లో పర్యటించారు. మల్కాజిగిరి చౌరస్తా నుంచి మజీద్ వెళ్లే రహదారిలో యూజీడీ పనులు పూర్తయినా రహదారి పనులు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, చర్యలు తీసుకోవాలని ఏఈ శ్రీకాంత్‌కు సూచించారు. ఓల్డ్ మల్కాజిగిరి హనుమాన్ వ్యాయామశాల సమీపంలో ఉన్న ఓపెన్ నాలాను యూజీడీ పైపులైనుగా మార్చాలని జలమండలి అధికారులకు సూచించారు. రాజీవ్‌గాంధీనగర్, ఎస్పీనగర్, బాలసరస్వతీనగర్ తదితర ప్రాంతాల్లో నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఏడీఈ యాదగిరిని కోరామన్నారు. కార్యక్రమంలో వీఐ రమేష్, ఎల్ఐ వెంకటేశ్వరరావు, బాలచందర్‌గౌడ్, సునీల్, యాకూబ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.